సాక్షి చిత్తూరు
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీ

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జీఆర్పీ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. - 8లో



భగవన్నామస్మరణతో కష్టాలు దూరం

యాగాలు చేయకపోయినా హరి నామస్మరణతో కష్టాలు దూరమవుతాయని ఉడిపి మఠాధిపతి తెలిపారు. - 8లో



బాగా చదవాలి..

విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలని తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డి సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం

చిత్తూరు కార్పొరేషన్: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు అందించిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను మరింత వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 12వ తేదీలోపు కులగణన ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనను రిటర్నింగ్ అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈ మేరకు 12వ తేదీ నిర్వహించే శిక్షణకు హాజరుకావాలని స్పష్టం చేశారు. అనంతరం ప్రాంతీయ ఉద్యోగ మేళా ఏర్పాట్లను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

దేవదాయశాఖ సహాయ కమిషనర్‌గా ప్రసన్నలక్ష్మి



ప్రసన్నలక్ష్మీని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

చిత్తూరు రూరల్: దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా ప్రసన్న లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలు ఆలయాల అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు.

15న చిత్తూరులో జాబ్‌మేళా

చిత్తూరు కార్పొరేషన్: స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన చిత్తూరులోని విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో రీజనల్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 100కు పైగా కంపెనీలకు చెందిన ప్రతినిధులు మేళాలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. పాల్గొంటుందన్నారు. 8వ తరగతి నుంచి పీజీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్ల వారు హాజరుకావచ్చన్నారు. ఆయా సచివాలయాల సిబ్బంది అర్హులను గుర్తించి జాబ్ మేళాపై అవగాహన కల్పించాలని సూచించారు. అభ్యర్థుల వివరాలను ఈనెల 12వ తేదీలోపు వలంటీర్లు నమోదు చేయాలని చెప్పారు. ఇతర వివరాలకు 9063561786, 9493210966, 7337030956, 8465830771 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పారిశ్రామికవాడలో మెగా రుణ మేళా



మాట్లాడుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంకు డీజీఎం అభిజిత్

గంగవరం : మండలంలోని పారిశ్రామికవాడలో శుక్రవారం పంజాబ్ నేషనల్ బ్యాంకు వారు మెగా రుణ మేళా నిర్వహించారు. బ్యాంకు డీజీఎం అభిజిత్ సిన్హా మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహమందిస్తామన్నారు. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పే వారికి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం సబ్సిడీపై మంజూరు చేస్తున్న రుణాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో లోన్లు కావాల్సిన వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్లు శ్రీకాంత్, భూపేష్ పాండ్య, సీనియర్ మేనేజర్ సత్యనారాయణ, చిత్తూరు బ్రాంచ్ మేనేజర్లు యుగంధర్, భాస్కర్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



వరి పైరును పరిశీలిస్తున్న రెడ్డి రాము

గంగాధర్ నెల్లూరు : మండలంలోని పాపిరెడ్డి పల్లె పంచాయతీ ఎర్రగుంటపల్లెలో రైతులకు తెగుళ్ల నివారణపై శుక్రవారం జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ వై.రెడ్డిరాము అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో సాగు చేస్తున్న వరి, వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో ఆకు ముడత, కాండం కుళ్లు, అగ్గి తెగులు నివారణకు సకాలంలో మందులు పిచికారీ చేయాలన్నారు. మామిడి పూతలో పురుగు, మచ్చలు రాకుండా భూ ప్రో ఫిజిస్, ఇమీడా క్లోరిడ్, థయోఫీనేట్ మిథైల్, ఫ్లోనో ఫిక్స్, వేప నూనె మిశ్రమాన్ని వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జి చక్రవర్తి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్





పుంగనూరులో సభకు హాజరైన మహిళలు

"మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలి.. ఆడపడుచులను శక్తిమంతులుగా తీర్చిదిద్దాలి.. సమాజంలో ఉన్నతంగా రాణించేలా ప్రోత్సాహమందించాలి.. అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి అనుక్షణం అండగా నిలవాలి".. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పుంగనూరు నియోజకవర్గంలోని పొదుపు గ్రూపులకు జగనన్న ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా శక్తికి ఆసరా

- ఆడపడుచుల అభ్యున్నతే లక్ష్యం
- పేదరికమే ప్రామాణికంగా పథకాలు
- పారదర్శకంగా సంక్షేమ ఫలాల పంపిణీ
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు : మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజాభివృద్ధి సాధ్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పుంగనూరు పట్టనం, మండలంలోని 1,626 మహిళా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.14.18 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మెప్మా బజారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 5,661 సంఘాలకు చెందిన 50,262 మంది మహిళలకు రూ.52.95 కోట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. ఆసరా పథకం కింద ఇప్పటి వరకు నాలుగు విడతల్లో మొత్తం రూ. 213.70 కోట్లు అందించామని వివరించారు. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకే జగనన్న మార్ట్‌లు, ఈ–మార్ట్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. వ్యాపార రంగంలో సైతం ఆడపడుచులు ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. నవరత్న పథకాల కింద ప్రజలకు రూ.కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేశామని వెల్లడించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, వాహనమిత్ర, చేదోడు, ఈబీసీ నేస్తం తదితర పథకాల ద్వారా జిల్లాలోని లక్షలాది కుటుంబాలు లబ్ధిపొందాయని వెల్లడించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. సమావేశంలో మెప్మా ఎండీ విజయలక్ష్మి, పీడీలు రాధా, తులసి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి పాల్గొన్నారు.



పుంగనూరు : సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పులిచెర్ల : ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చౌడేపల్లె : మండలంలోని ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ మేరకు చౌడేపల్లెకు చెందిన కె.మాధవికి రూ.6లక్షలు, లద్దిగం గ్రామానికి చెందిన కె.ప్రదీప్‌కుమార్–రూ.6లక్షలు, తిరుమణపల్లె గోవిందురెడ్డి– రూ.70 వేలు, పాత గూబలవారిపల్లెకు చెందిన ఆనందకుమార్– రూ.1.80లక్షలు, దాదేపల్లెకు చెందిన మొబీనాకు రూ.18వేల చొప్పున మొత్తం రూ.14.68 లక్షల చెక్‌లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రెడ్డి ప్రకాష్ పాల్గొన్నారు.



చౌడేపల్లె : లబ్ధిదారుకు చెక్ అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. ఆహారంపై ఫిర్యాదు వస్తే సహించే ప్రసక్తే లేదని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక బాలాజీకాలనీలోని పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఆయన ఎంఈఓ–2లతో సమావేశం నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో పిల్లలు భోజనం చేయడం లేదని తెలిసిందన్నారు. ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవచూపాలని సూచించారు. కోడిగుడ్డు 45–50 గ్రాముల బరువు ఉండాలని, తక్కువ ఉంటే ఏజెన్సీల ద్వారా మార్పు చేసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి తయాచు చేసిన ఫార్మెట్‌ను పూరించి జిల్లా కార్యాలయానికి పంపాలని కోరారు. అనంతరం సమగ్రశిక్ష అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ–1 విజయేంద్రరావు, ఏడీ–2 వెంకటేశ్వరరావు, డీవైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు అభివృద్ధికి సొసైటీ కృషి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర అభివృద్ధికి స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ కృషి చేస్తోందని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ సొసైటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం సభ్యులకు ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సత్య, శివకుమార్, నాగేంద్ర, సాధిక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

కలెక్టర్‌తో ఎస్పీ భేటీ



చిత్తూరు కార్పొరేషన్: కలెక్టర్ షణ్మోహన్‌ను క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జాషువా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, పలు విషయాలపై చర్చించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

చిత్తూరు అగ్రికల్చ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి కల్పించే దిశగా సీడాప్ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన నవగురుకుల్ సంస్థతో కలిసి 50 మందికి సాఫ్ట్‌వేర్ కోడింగ్ కోర్స్‌లో శిక్షణకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. పది నుంచి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన 17– 27 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. ఏడాది పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో సంస్థ వారే వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తిగలవారు నవగురుకుల్ వారు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. శిక్షణ అనంతరం రూ.20 వేల వేతనంతో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ వివరాల రిజిస్ట్రేషన్ కోసం 9963561755 . 9160912690 , 8015492433 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కుట్ర రాజకీయాలకు కేరాఫ్ బాబు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : రాష్ట్రంలో కుట్ర రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబునాయుడని డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెల్లడించారు. శుక్రవారం పాలసముద్రం సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఏటీఎం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అవినీతి, అసత్యాలు, వెన్నుపోట్ల చంద్రబాబుకు కాంగ్రెస్ నేత షర్మిల వత్తాసు పలకడం బాధాకరమన్నారు. బాబు చేతిలో షర్మిల, పవన్‌కల్యాణ్ పావులుగా మారారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలే కుటుంబసభ్యులని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జగనన్ననే జనం విశ్వసిస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని విమర్శించారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు రాష్ట్ర ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన అడ్రస్ గల్లంతు కావడం తథ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనలో కరువు విలయతాండవం చేసేదని, జగనన్న సుపరిపాలనలో రాష్ట్ర సుభిక్షంగా ఉందని వివరించారు. పేదల గుండెల్లో జగనన్న ఉంటే, ధనవంతులకు అండగా చంద్రబాబు ఉన్నారని తెలిపారు. నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మక పథకాలు అందిస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చెర్మన్ గాలి జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు అస్పళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, పార్టీ మండల కన్వీనర్ తులసీ యాదవ్, ఆర్‌బీకే చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, లిఖిత, సర్పంచ్ భాష్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, అయ్యప్ప, లిల్లీ, అనురేఖ, నరసింహరాజు, నాయకులు కేశవరెడ్డి, చంద్రశేఖర్‌రాజు, వేణు, కుట్టి, షణ్ముగరెడ్డి పాల్గొన్నారు.

అమ్మ కడుపు కోత..!



జిల్లా ఆస్పత్రిలో గర్భిణులు (ఫైల్)

జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. పేద ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడుపుతున్నారు. చిన్న చితకా రోగాలకు చికిత్స చేసుకోకుండా.. ఏకంగా ఏకంగా ప్రసవాలు...అబార్షన్లు చేసేస్తున్నారు. చివరకు తల్లుల ప్రాణాల మీదకు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలోనే మెడికల్ షాపుల్లో సైతం దాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండా అబార్షన్‌కు అవసరమయ్యే మాత్రలను విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. ప్రజారోగ్యంతో యథేచ్ఛగా చెలగాటమాడేస్తున్నారు.

- పెద్దపంజాణి మండలానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు పిల్లలు. ఆమె ఐదు నెలలకు క్రితం మరోమారు గర్భం దాల్చింది. ఐదో నెలలో అబార్షన్‌కు సిద్ధమైంది. ఇందుకోసం ఓ ఆర్‌ఎంపీని సంప్రదించింది, ఆయన సూచన మేరకు మందులు వినియోగించింది. దీంతో కడుపులోని బిడ్డ చనిపోయి, తల్లి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే ఆమెను కుటుంబీకులు చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తల్లిని కాపాడేందుకు వైద్యులు ఎంతగా శ్రమించినా ప్రయోజనం లేకుండా పోయింది.
- చిత్తూరు నగరం పొన్నియమ్మవీధిలోని ఓ అనధికారిక క్లినిక్‌లో నాలుగు నెలల గర్భిణికి కుటుంబీకులు అబార్షన్ చేయించారు. ఈ క్రమంలో ఆ తల్లికి అనారోగ్య సమస్యలు వచ్చాయి. వెంటనే ఆమెను వేలూరు సీఎంసీకి తరలించి చికిత్స అందించారు. సదరు క్లినిక్‌లో ఆర్‌ఎంపీ సరైన విధానంలో అబార్షన్ చేయలేదని, అందుకే ఈ పరిస్థితి ఏర్పడిందని నిపుణులు వెల్లడించారు.

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పలువురు ఆర్‌ఎంపీలు
- యథేచ్ఛగా నిబంధనల బేఖాతర్
- ప్రసవాలు..అబార్షన్లు చేస్తూ తల్లుల ప్రాణాలతో చెలగాటం
- ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపుల నిర్వాహకులు
- దాడులకు సన్నద్ధమవుతున్న అధికారులు

చిత్తూరు రూరల్ : జిల్లావ్యాప్తంగా సుమారు 2వేల మంది వరకు ఆర్‌ఎంపీలు ఉన్నారు. ఇందులో కొందరు ఇంటింటికి వెళ్లి చికిత్స అందిస్తే..మరికొందరు మాత్రం క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని చికిత్సలందిన్నారు. వీరిలో కొందరు ఆర్‌ఎంపీలు నిబంధనలను ఇష్టారాజ్యంగా తుంగలో తొక్కేస్తున్నారు. అరకొరా వైద్య పరిజ్ఞానంతో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. చిన్న చిన్న జబ్బులకు చికిత్స ఇవ్వడంతో సరిపెట్టుకోకుండా, పెద్ద పెద్ద రోగాలకు కూడా మందులిస్తామంటూ పలువురి జీవితాలను నాశనం చేసేస్తున్నారు.

కాసుల కోసమే..

గుట్టుచప్పుడు కాకుండా జరిగే ప్రసవాలు, అబార్షన్లను ఆసరాగా చేసుకుని ఆర్‌ఎంపీలుగా చలామణీ వుతున్న కొందరు కాసులు దండుకుంటున్నారు. ఇలా అబార్షన్ చేసుకునే వారిని ఓ ప్రైవేటు స్థలానికి రప్పించుకుంటున్నారు. ముందుగానే రేట్లు ఫిక్స్ చేసి ఇష్టానుసారంగా అబార్షన్లు చేస్తున్నారు. గర్భం నెలలు పెరిగే కొద్ది అందుకు తగ్గట్టు ఫీజు డిమాండ్ చేస్తున్నారు. రూ.10 వేల నుంచి రూ. 20 వేలకు వరకు గుంజుకుంటున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రసవానికి రూ. 20 నుంచి రూ. 30 వేలు తీసుకుంటున్నారని అధికారులు సైతం గుర్తించారు. చాలా మంది గర్భిణులు బెంగళూరు నుంచి వచ్చి చిత్తూరు, పలమనేరు, వి.కోట, కుప్పం, ఎస్‌ఆర్‌పురం, నగరి, పుత్తూరు, పెద్దపంజాణి తదితర ప్రాంతాల్లో అబార్షన్, ప్రసవాలు చేసే వారిని ఆశ్రయిస్తున్నారు. ఇలా అనధికారిక వ్యక్తుల వద్ద అబార్షన్లు చేసుకోవడంతో పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

దాక్టర్ల చీటీ లేకుండా..

జిల్లాలోని పలు మందుల దుకాణాల్లో దాక్టర్ల చీటీ లేకుండా మందులు, మాత్రలు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన దాక్టర్ల అనుమతితోనే మందులు అమ్మాలి. అలా కాదని కొందరు మందుల దుకాణదారులు విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారు. ముఖ్యంగా అబార్షన్ల మాత్రలను కూడా దాక్టర్ల అనుమతి లేకుండా ఇచ్చేస్తున్నారు. ఆర్‌ఎంపీలు రాసిచ్చే మాత్రలను కూడా అంటగడుతున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

కొందరు ఆర్‌ఎంపీలు అనధికారికంగా చేసే వైద్యంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు దాడులకు సిద్ధమయ్యారు. ఇక ఈనెల 6వ తేదీన జరిగిన మాతృమరణంపై కూడా జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై దాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మాత్రలు అమ్మినా, అబార్షన్ చేసినా జరిమానాతో పాటు కేసులు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

వైద్యులనే సంప్రదించాలి



గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేసుకుందామని చాలా మంది ఆర్‌ఎంపీల దగ్గరకు వెళ్లిపోతున్నారు. అలా చేసుకుంటే భవిష్యత్‌లో మహిళలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇబ్బందులు పడక తప్పదు. చేసేవారిపై కూడా క్రిమినల్ కేసులు పెడతారు. గర్భిణులు ఎప్పుడూ గుర్తింపు పొందిన వైద్యులనే సంప్రదించాలి. వారి సూచనల మేరకు బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలిస్తే.. అప్పుడు అబార్షన్‌కు వీలుంటుంది. – ఉషశ్రీ, గైనకాలజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి

వదిలిపెట్టం



ఇటీవల జరిగిన మాతృమరణం దారుణం. అబార్షన్ చేసిన వ్యక్తిని వదిలిపెట్టం. నిబంధనలు ఉల్లంఘించి వైద్యం చేస్తే ఊరుకోం. ముఖ్యంగా ప్రసవాలు, అబార్షన్ల జోలికి వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇటీవల జరిగిన మాతృమరణంపై పూర్తి స్థాయిలో విచారిస్తున్నాం. గుర్తింపు పొందిన దాక్టర్ల అనుమతి లేకుండా మందుల షాపుల్లో అబార్షన్లకు సంబంధించిన మాత్రలు విక్రయించడం నేరం. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాం. తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. – ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

క్లుప్తంగా

నేడు ప్రథమ మహాసభ



గౌతమ్‌రెడ్డిని మహాసభకు ఆహ్వానిస్తున్న నాయకులు రాజారెడ్డి, మాలిక్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌టీయూసీ అనుబంధమైన చిత్తూరు సీటీ ట్రేడ్ యూనియన్ ప్రథమ మహాసభ శనివారం నిర్వహించనున్నారు. సభకు విచ్చేయాలని విజయవాడలో ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డిని యూనియన్ నాయకులు రాజారెడ్డి, మాలిక్ శుక్రవారం ఆహ్వానించారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక సీబీ రోడ్డులోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఎదురుగా సభ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యతిథులుగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వస్తారన్నారు. కార్మికులు పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఐరాల : మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మాజీ హోంగార్డ్ శివకుమార్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 25 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరులోని తేనెబండకు చెందిన అశోక్ అనే వ్యక్తి వద్ద శివకుమార్ కర్ణాటక మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముకుంటున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



హాజరైన ప్రముఖులు, భక్తులు



శాస్త్రోక్తంగా తై అమావాస్య పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శుక్రవారం భరద్వాజ తీర్థంలో శాస్త్రోక్తంగా తైఅమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలోని స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి ఊరేగింపుగా భరద్వాజతీర్థానికి తీసుకెళ్లారు. అక్కడ శివాలయం ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఉంచి పసుపు, చందనం, కుంకుమ, విభూది, పాలు, నారికేళం, పెరుగు, పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయానికి వేంచేపు చేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తై అమావాస్య చివరి శుక్రవారం కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల పాటు సమయం పట్టింది. ఈ సందర్భంగా సాయంత్రం చేపట్టాల్సిన కుంకుమార్చన సేవలను అధికారులు రద్దు చేశారు. సాధారణ రోజులకంటే అధికంగా శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తిరుచ్చిపై దివ్యదర్శనం

వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేకసేవను చేపట్టి, శోభాయమానంగా అలంకరించారు. తదుపరి శ్రీకృష్ణముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విద్యుత్ దీపకాంతుల నడుమ ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.



తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీపద్మావతి అమ్మవారు



తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

వరసిద్ధునికి విశేష అభిషేకాలు



ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం తై అమావాస్యను పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు జరిపించి, భక్తులకు దర్శనం కల్పించారు.సాయంత్రం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజలకు కాకర్లవారి పల్లెకు చెందిన పట్టాభినాయుడు ఉభయదాకర్తగా వ్యవహరించారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీ



రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జీఆర్పీ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ షానుషేక్ మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో భారీ మొత్తంలో బిల్లులు లేకుండా వస్తువులు తరలిస్తుంటారని, అందుకే జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే గంజాయి, మద్యం రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక దృషి సారించినట్లు తెలిపారు. ఫ్యాన్లు, స్టీల్‌గిన్నెలు, మిక్సీలు, గొడుగులు, వెండి, బంగారు ఆభరణాలు ఇలా 24 నిషేధిత వస్తువుల జాబితాలో ఉన్నాయని వివరించారు. బిల్లులు లేకుండా ఎవరైనా వస్తువులు తీసుకెళుతుంటే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలకు డాగ్‌స్క్వాడ్‌ను సైతం వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. గత పదిరోజులుగా పెద్ద మొత్తంలో రికార్డులు లేని వెండి వస్తువులు, మిక్సీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీల్లో సీఐలు దేవేంద్రకుమార్, కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు తిరుమలరాజుపురం విద్యార్థిని



ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

పాలసముద్రం : జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తిరుమలరాజుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డైనేశ్వరి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దీనదయాళన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల అన్నమయ్య జిల్లా సుండుపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో డైనేశ్వరి ప్రతిభను ప్రదర్శించిందని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రేన్ కింద పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గులాబ్

గంగాధర నెల్లూరు : చిత్తూరు–తచ్చూరు హైవే నిర్మాణంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముక్కళత్తూరు కండ్రిగ వద్ద సాగుతున్న పనుల్లో క్రేన్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గులాబ్ (48)ప్రమాదవశాత్తూ క్రేన్ హైడ్రాలిక్ కిందపడి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు సీఐ శంకర్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన ముబారక్

వి.కోట: మండలంలోని కొంగాటం గ్రామానికి చెందిన ముబారక్(30) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించే ముబారక్ బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాగా చదవాలి.. గర్వపడేలా ఎదగాలి!



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, (ఇన్‌సెట్) సి.గొల్లపల్లెలో చెవిరెడ్డి విద్యాకానుకను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం
- జగనన్న స్ఫూర్తి, ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆశీస్సులతో పుస్తకాల పంపిణీ
- 395 పాఠశాలల్లో 23,150 మందికి అందజేత
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'బాగా చదవాలి.. మంచి ఉద్యోగం సాధించాలి. సమాజానికి మంచిచేస్తూ కన్న తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి' అని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 395 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 23,150 మంది విద్యార్థులకు 2,77,800 నోటు పుస్తకాలు, 23,150 రైటింగ్ ప్యాడ్‌లు, 96,600 మెదడును పదునుపెట్టే ఫజిల్స్ సెట్‌ల(ఆట వస్తువులు)తో కూడిన విద్యాకానుకను అందించే కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతి రూరల్ మండలం, సీమల్లవరం పంచాయతీలో ఆయన ప్రారంభించారు. అనంతరం పాతకాల్వ, పైడిపల్లి, సి.గొల్లపల్లి, రామానుజపల్లి, మల్లంగుంట, చిగురువాడ, కేసీపేట, దుర్గసముద్రం, కుంట్రపాకం, తనపల్లి పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్దకు వెళ్లి నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, బ్రెయిన్ ఎక్సర్ సైజ్ ఫజిల్ షీట్‌లతో కూడిన చెవిరెడ్డి విద్యాకానుక కిట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 395 పాఠశాలల్లో 23,150 మంది విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్టు వెల్లడించారు. విద్యా రంగంలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన జగనన్న పరిపాలనను స్ఫూర్తిగా తీసుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆశీస్సులతో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో నోటు పుస్తకాల పంపిణీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు బాధ్యతగా హాజరవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సరస్వతీ పూజతో ప్రారంభం

మొదటగా సి.మల్లవరం ఎంపీపీ స్కూల్ ఆవరణలో సరస్వతీ పూజచేసి పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మోహిత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. విద్యాకానుక కిట్‌ను, అందులోని కానుకలను చూస్తూ విద్యార్థులు మురిసిపోయారు. మోహిత్ అన్న ఇచ్చిన కానుక సూపర్... అంటూ కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో చెబుతుండడం కనిపించింది. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరంలో విద్యాకానుక కిట్లు అందుకున్న విద్యార్థులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం

- శ్రీ విద్యాధీశ తీర్థ స్వామీజీ
- ఘనంగా రెండో రోజు పురందరదాసు మహోత్సవాలు
- 12 మంది యువ కళాకారులకు ప్రతిభా పురస్కారాలు

తిరుమల: కలియుగంలో యజ్ఞాలు, యాగాలు, తపస్సు చేయకపోయినా హరినామస్మరణ చేస్తే ఎంతటి కష్టమైనా దూరం అవుతుందని ఉడిపి పాలిమారు మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామీజీ తెలిపారు. పురందరదాసుల ఆరాధన మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాధీశతీర్థ స్వామీజీ మాట్లాడుతూ పురందరదాసు కీర్తనలు యావత్తూ లోకోక్తులేనన్నారు. మానవాళికి పురందరదాసు జీవితసారమే ఆదర్శప్రాయమన్నారు. కేవలం ధనార్జనే ప్రధానంగా భావించిన వ్యక్తి తాను ఎదుర్కొన్న కొన్ని సంఘటనల ద్వారా జ్ఞానసిద్ధి పొంది ప్రఖ్యాత హరిదాసులుగా ఖ్యాతిచెందారన్నారు. దాస పదాల ద్వారా అందరికీ అర్థమయ్యేలా సులువుగా భగవంతుని తత్వాన్ని, శరణాగతి విధానాన్ని, ధర్మాన్ని, నైతిక విలువలను తెలియజేశారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యాధీశతీర్థ స్వామీజీ, పాలిమారు మఠం ఉత్తరాధికారి విద్యారాజేశ్వతీర్థ స్వామిజీతో కలిసి దాససాహిత్యంలో విశేష కృషి చేసిన 12 మంది యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు.

వన్నెకుల జైత్రయాత్ర మహాసభ రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శివం కల్యాణ మండపంలో ఈనెల 11న నిర్వహించే వన్నెకుల క్షత్రియుల జైత్రయాత్ర మహాసభను జయప్రదం చేయాలని రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ పిలుపునిచ్చారు. శుక్రవారం వన్నెకుల జైత్రయాత్ర జరిగే శివం కల్యాణ మండపాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధిక జనాభా వన్నెరెడ్లే ఉన్నారని గుర్తుచేశారు. పల్లవ రాజ వంశానికి చెందని వన్నెరెడ్లు ధైర్య, సాహసాలకు ప్రతీకలన్నారు. అలాంటి వన్నెరెడ్లు ఏకతాటిపై చేరి ఐక్యతగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాజీ మంత్రిమోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ భరత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, స్వామిరెడ్డి భరత్‌రెడ్డి, మురళీరెడ్డి, మధురెడ్డి, రత్నంరెడ్డి, దాము రెడ్డి, జగదీశ్‌రెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.